ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 19 జూలై 2024

అంగన్‌వాడీలపై నిఘానేత్రం!



భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి సిగ్గంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై సర్కారు దృష్టి పెట్టింది. పౌష్టికాహారాన్ని పకడ్బందీగా పంపిణీ చేయాలనే ఆలోచనకు వచ్చింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సర్కారు ఆలోచన చేస్తోంది. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం నుంచి మౌలిక ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల్లోని టీచర్లు, సిబ్బంది ప్రభుత్వ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అంగన్‌వాడీ కేందాల్లో జరిగే కార్యక్రమాలపై నిఘా ఉంటేనే సక్రమంగా అమలవుతాయనే అభిప్రాయాలు సైతం వినవస్తున్నాయి.

అక్రమాలకు చెక్ పెట్టేందుకే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అస్తవ్యస్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను గాడిన పెట్టి పౌష్టికాహారంపై పకడ్బందీగా నిఘా పెట్టేందుకు సన్నద్ధం అవుతోంది. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టిహారం సరిగ్గా జరగడం లేదని, కేవలం రికార్డుల్లోనే నమోదు చేసి పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలకు చెక్ పెట్టేందుకు సర్కారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చాలా కేంద్రాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనితీరు సక్రమంగా లేదని ప్రభుత్వం ఈ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. అయితే జిల్లాలో భూపాలపల్లి పట్టణంలోని పలు కేంద్రాల్లో కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉండగా.. ఇటీవల కాలంలోనే చిట్యాలలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని కోడిగుడ్లు దుకాణాల్లో దర్శనమిచ్చిన ఘటన సైతం వెలుగు చూసింది.

సమయపాలనపై దృష్టి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎవరెప్పుడొస్తున్నారు.. ఎప్పుడు వెళ్తున్నారనే విషయాల్ని ఇట్టే కనిపెట్టేయొచ్చు. ఈ నేపథ్యంలో సమయపాలపై కూడా దృష్టి సారించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించకుండా నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మూడో కన్ను నిఘా ఏర్పాటు చేస్తే ప్రతీ రోజు కేంద్రానికి ఎంత మంది వస్తున్నారు.. టీచర్లు, ఆయాలు సమయ పాలన పాటిస్తున్నారా.. లేదా అనే విషయాన్ని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరగనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిర్ణయం పట్ల అసంతృప్తి

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో టీచర్లు, ఆయాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతీది ఆన్‌లైన్‌లో రికార్డు చేస్తూ పకడ్బందీగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూడటమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పౌష్టికాహారం పంపిణీని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవకతకవలు జరగడం లేదనే ధీమాను కొంత మంది వ్యక్తం చేస్తున్నారు.

- కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్కారు కసరత్తు
- పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు
- సిబ్బంది సమయ పాలనపై ప్రత్యేక దృష్టి
- తాజా చర్యల పట్ల టీచర్లలో అసంతృప్తి
- త్వరలోనే 644 కేంద్రాలకు జారీ కానున్న ఆదేశాలు

పూర్తిస్థాయి ఆదేశాలు రాకముందే ప్రభుత్వం తీసుకోబుతున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే వాదన ఒకింత వినవస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 644 కేంద్రాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో ఒకటి భూపాలపల్లి కాగా.. మరొకటి మహదేవపూర్ ప్రాజెక్టు కేంద్రాలున్నాయి. వీటిల్లో మొత్తంగా 644 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలో 375 మెయిన్ కేంద్రాలు, 42 మినీ కేంద్రాలున్నాయి. అలాగే మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలో 214 మెయిన్ కేంద్రాలు, 13 మినీ కేంద్రాలు ఉన్నాయి.





అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు

పూర్తి స్థాయి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

- సీహెచ్.అవంతి, జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ శాఖ అధికారి

ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం. ఇప్పటి వరకైతే ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ కేంద్రం నుంచి పకడ్బందీగా పౌష్టికాహారాన్ని అందించేలా, సమయపాలన పాటించేలా ఆదేశాలు జారీ చేశాం. అవకతవకలకు ఆస్కారం లేకుండా చూస్తున్నాం.

రైతుల కళ్లల్లో ఆనందం నింపేందుకే రుణమాఫీ

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



చిట్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, జూలై 18: ఎన్నికల హామీలో భాగంగా రైతుల కళ్లల్లో ఆనందం నింపేందుకే రూ.2లక్షల వ్యవసాయ రుణాల మాఫీని విడుతల వారీగా అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ముందస్తు సంబరాల్లో భాగంగా గురువారం మండలంలోని నవాబుపేట నుంచి చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదిక వరకు కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టారు. రైతు వేదిక ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా పక్షపాతి పార్టీ అని, 10 ఏళ్ల క్రితం వైఎస్సార్ రూ.2లక్షలు వ్యవసాయ రుణాలు ఒకే దఫాలో మాఫీ చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితోనే రూ.2లక్షలు రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకాను అమలు చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. రుణమాఫీలో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్, ముకిరాల మధువంశీకృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, బుర్ర లక్ష్మణ్, సర్వ శరత్‌కుమార్, దబ్బెట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

మిఠాయిలు పంచి వేడుకలు జరుపుకొన్న కాంగ్రెస్ శ్రేణులు



ములుగులో సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ములుగు కలెక్టరేట్, జూలై 18 : ములుగు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. బాణాసంచా కాల్చి మిఠాయి అందించుకుని సంబరాలు జరుపుకున్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీని హర్షిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు ములుగులోని 163వ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించగా చౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఇచ్చిన మాటప్రకారం రూ.2లక్షల రైతు రుణమాఫీని అమలు చేసిందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమైన జల ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. వ్యవసాయానికి పునర్వైభవం తీసుకువచ్చి రైతుల కళ్లలో ఆనందం చూ దాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి తపన అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమంలో ఆదర్శంగా తెలంగాణ

రుణమాఫీ నిధుల విడుదలలో సీఎం రేవంత్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అధికారులు



వీసీలో సీఎం ప్రసంగాన్ని వింటున్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, జూలై 18 : రైతు సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రైతు రుణమాఫీ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ములుగలోని రైతు వేదికలో కలెక్టర్ దివాకర, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తున్నామని అన్నారు. మొదటి విడతగా రూ.లక్ష వరకు రుణాలు ఉన్న రైతులకు మాఫీ చేశామని, రెండో విడతలో రూ.లక్షన్నర వరకు, మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ భూమి ఉండి రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ పథకం వర్తిస్తుందని, రేషన్‌కార్డు రుణమాఫీ పథకానికి ప్రామాణికం కాదన్నారు. 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యూవల్స్‌ను అసలు, వడ్డీ కలిపి ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిది మండలాల రైతుల సౌకర్యార్థం రుణమాఫీ ఫిర్యాదుల పరిష్కారానికి మండల కేంద్రాల్లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామని సీఎంకు వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్, ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ రమేష్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఎర

రూ.60లక్షల వరకు వసూలు చేసిన ఘనుడు

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ఉద్యోగాలంటూ ఆశ

ఒక కారు సీజ్.. ముగ్గురు నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: అన్ని అర్హతలు ఉండి ఉద్యోగం కోసం వేచిచూస్తున్న నిరుద్యోగులు.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఏదైనా పని చేద్దామనే ఆశగా ఎదురుచూస్తున్న వ్యక్తులకు ఓ వ్యక్తి గాలం వేశాడు. తనకున్న పలుకుబడిని ఉపయోగించి కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ నమ్మబలికి అందిన కాడికి దండుకున్నాడో ఘనుడు. తనకు ఉన్న పరిచయాలతో ఎవరూ ఏమి చేయలేరనే ధీమాలో ఉన్న ఆవ్యక్తి ఆటలకు భూపాలపల్లి పోలీసులు కళ్లెం వేశారు. అతనికి సహకరించిన మరో ఇద్దరిని కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు.. భూపాలపల్లి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు కాంట్రాక్టు తనకే వస్తుందని నమ్మబలికాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు, ఆశావాహుల నుంచి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వసూలు చేశాడు.

కొద్ది రోజులకు కొంత మందికి జాబ్ కల్పించినట్లుగా డ్యూటీలు కూడా చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేసరికి శ్రీనివాసరావుపై కొంత మందికి అనుమానం కలిగింది. దీంతో ఆయన్ను నిలదీయడంతో కొంత మందికి డబ్బులు ముట్టజెప్పాడు. మరికొంత మందికి చెక్కులు రాసి ఇచ్చాడు. అట్టి డబ్బులను డ్రా చేసుకునేందుకు గాను బ్యాంకుకు వెళ్లిన గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన దొంగల చందుతో పాటు మరికొందరు శ్రీనివాసరావు అకౌంట్‌లో డబ్బులు లేవని విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో నిలదీయగా శ్రీనివాసరావుతో పాటు అతని వద్ద పనిచేసే వ్యక్తులు కలిసి కలెక్టరేట్ కార్యాలయం పక్కన బాధితుల్ని కొట్టి చెక్కులను లాక్కొని చంపుతామని బెదిరించారు. ఇదే విషయమై దొంగల చందు భూపాలపల్లి పోలీసులకు శ్రీనివాసరావుతో పాటు అతని వద్ద పనిచేసే సుభాష్‌కాలనీకి చెందిన సన్నాయిల సుభాష్, కాశీంపల్లి గ్రామానికి చెందిన మోకిడి అశోక్‌లపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులైన ఆముగ్గురిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో గురువారం శ్రీనివాసరావు, సుభాష్, అశోక్‌లను రిమాండ్‌కు పంపించారు. నిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని ఆసరాగా చేసుకొని డబ్బులు దండుకోవాలని చూస్తే ఎవరిని ఊపేక్షించమని ఎస్పీ కిరణ్ ఖరే స్పష్టం చేశారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు ప్రసాద్, సుధాకర్, రమేష్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ




ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఏటూరునాగారం రూరల్, జూలై 18: ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని 4, 5వ వార్డులో పర్యటించారు. ఎస్సీ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాలనీవాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మేజర్ గ్రామపంచాయతీకి చేరుకొని పలు రికార్డులను పరిశీలించారు. అటవీశాఖ నర్సరీకి సంబంధించిన స్థలంను గతంలో తహసీల్దార్ గ్రామపంచాయతీకి కేటాయించడం జరిగిందని, ఇపుడు ఆస్థలానికి అటవీశాఖాధికారుల అభ్యంతరాలు తెలుపుతున్నారని, సమస్యను పరిష్కరించి స్థలాన్ని జీపీకి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు గ్రామపంచాయతీ అధికారులు తెలియచేశారు. ఆమె వెంట తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద ముప్పును ఎదుర్కోవడానికి సమర్థవంతంగా పనిచేయాలి

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

నెలవారీ సమీక్షలో ఎస్పీ శబరీశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జూలై 18: జిల్లాలో వరద ముప్పును ఎదుర్కోవడానికి పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో జిల్లాకు వరద ముప్పు పొంచి ఉన్నందున గత అనుభవాల దృష్ట్యా ప్రజల క్షేమం కోసం పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దల సహకారంతో మండల కేంద్రాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు తగ్గిపోయాయని, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల పంట పొలాలు, అడవుల్లో విద్యుత్ తీగలు అమరుస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకస్మిక వరదలు సంభవిస్తే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ములుగు అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, సీఐలు శంకర్, శ్రీనివాస్, బండారి కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజొద్దీన్, వెంకటేష్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ రాహుల్‌శర్మ




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 18: రుణమాఫీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ బ్యాంకర్లకు సూచించారు. గురువారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ ప్రక్రియపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16,502 మంది రైతులకు రుణమాఫీ జరుగుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతు కుటంబంకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ అవుతాయన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని బ్యాంకర్లకు సూచించారు. రుణమాఫీ అయ్యే రైతుల వివరాలు పక్కాగా ఉండాలన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా బ్యాంకుల్లో ప్రత్యేక సమయం, ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. రైతు రుణమాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఏవో విజయ్‌భాస్కర, ఎల్‌డీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన గోదావరి

సమ్మక్కసాగర్‌కు ఇన్‌ఫ్లో 2,52,400 క్యూసెక్కులు

ఔట్‌ఫ్లో 2,51,817 క్యూసెక్కుల నీరు విడుదల



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వస్తున్న వరద నీరు

కన్నాయిగూడెం, జూలై 18: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి భారీగా పెరిగింది. బుధవారం 86,630 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదు కాగా గురువారం ఏకంగా 2,52,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదైంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి వరద నీరు పెద్దఎత్తున వస్తోంది. ఎగువన ఉన్న బ్యారేజీలు, ఉప నదుల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో గోదావరికి వరద నీరు పోటెత్తుతోంది. దేవాదుల నుంచి 583 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తుండగా, బ్యారేజీలోని 52గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 76.60 మీటర్ల నీటిమట్టం, దేవాదుల వద్ద 76.20 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

- వాజేడు : మండలంలో గోదావరి క్రమేణా పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద నీరు చేరి పెరుగుతుంది. ఎగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేయటంతో గురువారం ఉదయం నుంచి గోదావరి పెరుగుల ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు 10.250 మీటర్ల నీటిమట్టం ఉన్న గోదావరి 10గంటలకు 10.570 మీటర్లు, సాయంత్రం 5గంటలకు 10.780 మీటర్ల నీటిమట్టంతో పెరుగుతుందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు విజ్ఞప్తి చేశారు.
- మహదేవపూర్ : త్రివేణి సంగమం కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం రోజు రోజుకు పెరుగుతోంది. తాజాగా గురువారం ఆరు మీటర్లకు చేరింది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో ప్రాణహిత నది నుంచి పెద్ద ఎత్తున వరద చేరడంతో గోదావరికి వరద ప్రవాహం పెరిగింది. అంతేగాకుండా మానేరు నుంచి నీటి ప్రవాహం రావడంతో పాటు తెలంగాణలోనూ వర్షాలు కురవడంతో గోదావరి నీటిమట్టం పెరిగింది.



అటవీ శాఖలో బదిలీలు

వరంగల్ క్రైం, జూలై 18: భద్రాద్రి కొత్తగూడెం జోన్ పరిధిలోని అటవీ శాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. గురువారం హనుమకొండ అటవీ శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. జోన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన బదిలీల్లో 106 మంది స్థాన చలనం చెందారు. బదిలీ అయిన వారిలో 27 డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, 53 సెక్షన్ ఆఫీసర్లు, 19 సీనియర్ అసిస్టెంట్లు, 7 సూపరింటెండెంట్లు ఉన్నారు.



నేడు ఒకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, జూలై 18: ఈనెల 19న హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 2021-22, నుంచి 2023-24లో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ జాబ్‌మేళా-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఆవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7చొప్పున ఆర్‌డీఎస్‌డీ సంస్థ వారు శిక్షణకాలంలో ఇస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులందరూ రెండు జతల బయోడెటాతోపాటు రెండు ఫొటోలు, ఇంటర్, ఎస్సెస్సీ, ఆధార్‌కార్డుతోపాటు ఇతర విద్యార్హతల ధృవపత్రాలను తీసుకునిరావాలని సూచించారు. జాబ్‌మేళా కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉదయం సెషన్‌లో పారామెడికల్, సాయంత్రం సెషన్‌లో ఇంజనీరింగ్, కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అప్రెంటిషిప్ సాగుతుందని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ ఎ.గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, ఎస్ఎస్ఎఫ్ పీవో డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.విష్ణుకాంత్, ఎం.రాజేంద్రప్రసాద్, పి.విజయకుమార్, ఎ.దిలీప్, ఖాదర్‌బాబా, డి.రవి, చౌహాన్, మహేందర్, జయపాల్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ప్రొఫెసర్ సుభాష్ మృతి

నివాళులర్పించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ కారంపూడి సుభాష్ (76) గుండెపోటుతో మృతి చెందారు. గత 16న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచగా దుబ్బాకలోని తన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సుభాష్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

1970లో వర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగంలోకి చేరిన సుభాష్. ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. వర్సిటీలో బాటనీ, బయోటెక్నాలజీ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా, వర్సిటీ అభివృద్ధి అధికారిగా, వసతి గృహాల సంచాలకుడిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రొఫెసర్ సుభాష్ కేయూ పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జాఫర్ నిజాం పర్యవేక్షణలో డాక్టరేట్ సాధించారు. మృతి చెందిన ప్రొఫెసర్ సుభాష్ మృతికి సంతాపంగా గురువారం కేయూ బయో టెక్నాలజీలో విభాగాధిపతి డాక్టర్ శాస్త్రి తాడూరి నేతృత్వంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నూనె రామస్వామి, ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, ప్రొఫెసర్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.







మొగిళిచర్లలో అనధికారిక లేఔట్ తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిళిచెర్ల శివారులో సర్వే నెంబర్ 178/2సి, 179సిలో మూడెకరాల విస్తర్ణంలో ఉన్న వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్ ప్లాట్ల హద్దు రాళ్లను గురువారం బల్దియా అధికారులతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేసినందుకు గాను లేఔట్‌ను తొలగించినట్టు ఏసీపీ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీబీవో ఖాజాషరీఫ్, చైన్‌మెన్ ప్రశాంత్‌తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

21న సింగర్ సనశ్రీ 8 గంటల నాన్‌స్టాప్ పాటలు

వడ్డెపల్లి, జూలై 18: హనుమకొండ న యింనగర్‌లోని వాగ్దేవి కాలేజీలో ఈనెల 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 108 పాటలను నిరంతరంగా సింగర్ సనశ్రీ ఆలాపించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగర్ సనశ్రీ మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ , తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈ మూడు బుక్స్‌రికార్డ్స్ కోసం 108 మల్టీ లాంగ్వేజ్ పాటలను నాన్‌స్టాప్‌గా 8 గంటల పాటు ఆలాపించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో తోట పూర్ణచందర్‌రావు, సిరాజొద్దీన్, తిరుపతయ్య, రంగు రఘుపతి, రాంమూర్తి, శ్రీమన్నారాయణ పాల్గొనున్నారు.









పరీక్షలు ముగిసిన విద్యార్థులు హాస్టల్ ఖాళీ చేయాలి..

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీలో తాజాగా పీజీ రెండో ఏడాది పరీక్షలు ముగిసిన విద్యార్థులు జూలై 20వ తేదీలోగా హాస్టళ్లు ఖాళీ చేయాలని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ చేసిన విద్యార్థులు హాస్టల్ గదుల తాళాలను కేర్ టేకర్లు అప్పగించాలని స్పష్టం చేశారు. వర్సిటీ ఆదేశాలు పాటించని విద్యార్థుల గదులను స్వాధీనం చేసుకుని వర్సిటీ అధికారులే తాళాలు వేస్తామని పేర్కొన్నారు. తర్వాత వర్సిటీలో తలెత్తేపరిణామాలకు సిబ్బంది బాధ్యత ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల దరఖాస్తుల గడువును ఈ నెల 21 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.సక్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు http://iti.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వాసంతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. హనుమకొండలోని వడ్డెపల్లి ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసియా సిద్ధిఖి అనే ఉపాధ్యాయురాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించారు. వర్క్ బుక్‌లను ఉపయోగించకపోవడం, విద్యార్థులకు వర్క్ బుక్స్‌ను ఇవ్వకపోవడం, పాఠశాల మౌలిక వసతులు పట్ల అవగాహన రాహిత్యాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రావీణ్య.. ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించడంతో డీఈవో డి.వాసంతి ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జూలై 18: షుగర్, గుండెవ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 19న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్ కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ పీవీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు, మరో రూ.1500 విలువైన రెటినోపతి కంటి పరీక్షను సైతం ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9955996166, 91338933లలో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

న్యూశాయంపేట, జూలై 18: కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన సమగ్ర కుల గణన యాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు దూరం కావడంతోనే గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ తగ్గిందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీలుఅంటే బ్రిలియంట్ క్యాస్ట్ అని.. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదన్నారు. బీసీలకు ఉన్న తెలివి ప్రపంచంలో ఎవరికీ లేదని, దమ్ము ధైర్యం ఉన్న కులం బీసీ కులం అన్నారు. గత శాసనసభఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు కులగణన చేపడుతామని చెప్పారని, ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీలు పోరాటం చేస్తారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర నాయకులు కుందారపు గణేష్‌చారి, బాలగాని బాలరాజు గౌడ్, సగర శేఖర్, వడ్నాల నరేందర్, డాక్టర్ చిర్ర రాజు, బీసీ సంక్షేమ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు, దాడి మల్లయ్య, నాగరాజు, శోభారాణి, పద్మజతో పాటు పెద్ద సంఖ్యలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణకు విజ్ఞప్తి



వాకాటి కరుణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

హనుమకొండ సిటీ, జూలై 18: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ తరువాత లభించే ఆర్థిక ప్రయోజనాల అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ప్రధాన కార్యదర్శి రమాతార విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో వాకటి కరుణను కలిసి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, కేంద్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కార చర్యలను చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందచేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే ఇందుకు సంబంధించిన జీవోను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. అనారోగ్య సమస్యలతో ఉన్న టీచర్లు, హెల్పర్లకు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, టీచర్లకు అదనపు పనులు అప్పగించరాదని, కేంద్రాల్లో వసతులు కల్పించాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వేదవతితో పాటు ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువుల కోసం 'వేట'కుక్కలు..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల వేటగాళ్లు విచ్చలవిడిగా అడవి జంతువులను మట్టుబెట్టి యథేచ్ఛగా వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగిస్తుంటే.. మరికొందరు విద్యుత్ వైర్లు అమరుస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా వేటకుక్కలను వినియోగిస్తూ అడవి జంతువులను వేటాడుతున్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం పల్లెగుట్ట సమీపంలో కొందరు వేటగాళ్లు అడవి జంతువుల ఇదిగో ఇలా సుమారు పది కుక్కలను వదలగా.. అవి పొలాలను జల్లెడపడుతూ కనిపించాయి. అయితే అటవీ అధికారులు స్పందించి వేటగాళ్లను కట్టడి చేసి అడవి జంతువులను కాపాడాలని జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శిశువు రగడ

మగ శిశువుకు బదులు, ఆడ మృత శిశువునిచ్చారని బంధువుల ధర్నా

వరంగల్ మెడికల్, జూలై 18: తమకు మగ శిశువు పుడితే చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని తల్లిదండ్రులు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అనూష. బుధవారం ప్రసవం కోసం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ప్రసవం చేశారు. అయితే చనిపోయిన ఆడ శిశువుడును ఇచ్చారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమకు మగశిశువు పుట్టాడని, ఈ స్థానంలో చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని కన్నీటిపర్యంతం అయ్యారు. వివాహ అనంతరం ఏడేళ్ల తర్వాత గర్భం ధరించిందని, ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇలా చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు అనుమానం ఉంటే డీఎన్ఏ పరీక్షలకైనా తాము సిద్ధమే అన్నారు. కుటుంబసభ్యులకు ముందుగానే సమాచారం ఇచ్చామని వివరించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం



గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీబృందం

గీసుగొండ, జూలై 18: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఇటలీ, సిసిలియా, ఏరిత్రియా దేశాలకు చెందిన ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. బాలవికాస సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2 వారాల పాటు కమ్యూనిటీ డ్రీవెన్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ బృందం ఫీల్డ్‌విజిట్‌లో గంగదేవిపల్లిని సందర్శించినట్లు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలను రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బాలవికా స సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి సునీత, ఆశలత, సుజాత, దీప, రిసోర్స్ పర్సన్స్ గూడ సరోజన, వితంతువుల కమిటీ అధ్యక్షురాలు మేడిద సుశీల పాల్గొన్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 18: గత నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రూ.7లక్షల 89వేల భద్రత చెక్కును అందచేశారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో రాజు సతీమణి మాధవికి కమిషనర్ చెక్కు అందించారు. వారి కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్.. మిగతా బెనిఫిట్స్ తొందరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పరిపాలన విభాగం ఏవో రామకృష్ణ స్వామి, సెక్షన్ సూపరింటెండెంట్ జలజ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా షర్మిల

ఆర్ఎంవోగా యాకుబ్ పాషా.. బదిలీపై రానున్న వైద్యులు

గిర్మాజీపేట, జూలై 18: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ఆర్ఎంవోగా డాక్టర్ యాకుబ్ పాషాలు నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ బదిలీల్లో ప్రొఫెసర్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గైనకాలజీ అండ్ అబ్‌స్టిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నిర్మలాకుమారి.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ గాంధీ వైద్య కళాశాలలో గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్యామ్ కుమార్ జనగామ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ యాకుబ్ పాషా ఆర్ఎంవోగా వస్తున్నారు. అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్‌లో సీకేఎం ఆస్పత్రి రేడియాలజీ డాక్టర్ రాంబాబు దామెర పీహెచ్‌సీకి, డాక్టర్ వై.వనజ హసన్‌పర్తి పీహెచ్‌సీకి, పీపీ యూనిట్ డాక్టర్ శ్రీదేవి కడిపికొండ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. కాగా, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రేడియోగ్రాఫర్ సిద్ధార్థ 40 శాతం బదిలీల్లో లేకపోవడంతో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌లో సీకేఎం ఆస్పత్రిలోనే యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నర్సింగ్ అధికారులు, శనివారం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది.

21న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 18: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఆర్బిటర్ చిన్న రాముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ప్రపంచ చదరంగం(చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయిలో అండర్-7, 9, 11, 13 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9963214108 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష

మొదటి సెషన్‌లో 89.6, రెండో సెషన్‌లో 89.13 శాతం మంది హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాల్లో సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తున్న పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం పూట సెషన్‌లో 1,206 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,038 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పూట నిర్వహించిన రెండో సెషన్‌లో ఒకే ఒక సెంటర్‌లో 138 మంది అభ్యర్థులకు గాను 123 మంది హాజరయ్యారు. మొదటి రోజు తొలి సెషన్‌లో 89.6 శాతం, మలి సెషన్‌లో 89.13 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం పూట సెషన్‌లో చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ పరీక్ష కేంద్రంలో 102 మంది, అయాన్ డిజిటల్ సెంటర్‌లో 216, జయ ఇనిస్టిట్యూట్ కేంద్రంలో 210, మోక్షిత సెంటర్‌లో 387, నోబెల్ టెక్నాలజీస్ సెంటర్‌లో 153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట సెషన్‌లో అయాన్ డిజిటల్ కేంద్రంలో 123 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు స్థానిక నిర్వాహకురాలు డి. వాసంతి తెలిపారు.

యాప్, వెబ్ సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలి..

హనుమకొండ టౌన్, జూలై18 : టీజీ ఎన్పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని నోడల్ ఆఫీసర్లను సీఎండీ ఆదేశించారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఏ విధంగా బిల్లు చెల్లించేలా అనే దానిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేసుకొని, వాటిని ఓపెన్ చేసుకొని పని చేయడం ద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. ప్రతీ సర్కిల్‌లో ఇలా చేయడం ద్వారా అంతరాయాలు కనిష్టస్థాయికి తగ్గుతాయన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, సీజీఎంలు తిరుమల్‌రావు, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, వేణుబాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ (టి) శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



ములుగులో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాల ఘనపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

మాఫీ జరిగె.. పండుగ వచ్చే..



మహబూబాబాద్ రైతువేదికలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

దేవరుప్పులలో పొలం వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకుల సంబురాలు





హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట జరిగిన సంబరాల్లో డప్పు కొడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఎన్నికల హామీగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. గురువారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తూ 'రుణమాఫీ పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామాల్లో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు చిత్రపటాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు ర్యాలీలు.. ఎద్దులబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక రైతువేదికల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంతో మాట్లాడి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాలలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



తొర్రూరు మండలం మాటేడులో ఎద్దులబండిపై నుంచి రైతులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో బైకు ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



సీఎం రేవంత్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు ఎల్లయ్య

మీకు రుణపడి ఉంటాం..

రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాం

సీఎం రేవంత్‌తో బొల్లికుంట రైతు ఎల్లయ్య

శంభునిపేట, జూలై 18: రైతులకిచ్చిన మాట నిలుపుకొన్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని వరంగల్‌లోని ఉర్సు ప్రాంతానికి చెందిన రైతు బొల్లు ఎల్లయ్య అన్నారు. రుణమాఫీ సందర్భంగా గురువారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడగా అందులో భాగంగా వరంగల్‌కు చెందిన రైతు బొల్లు ఎల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసి రైతులకు మేలు చేసిందని, సీఎంతో చెప్పారు. జోడో యాత్ర సభలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రైతు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. తాము రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని, ఆయన్ను వరంగల్‌కు మళ్లీ తీసుకురావాలని రేవంత్ రెడ్డిని కోరారు. అందుకు స్పందించిన సీఎం రేవంత్... రైతు రుణమాఫీ వరంగల్ డిక్లరేషన్‌లోనే చెప్పామని అధికారంలోకి వచ్చి చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని వరంగల్ తీసుకొస్తే సభను విజయవంతం చేస్తారా అని ఎల్లయ్యను అడుగగా.. 5లక్షల మంది రైతులను తీసుకువస్తాం అని ఎల్లయ్య సమాధానం ఇచ్చారు.

శభాష్ అప్పయ్య

▸▸ డీఎంహెచ్‌వోను అభినందించిన మంత్రి రాజనర్సింహ

ములుగు, జూలై 18 : జిల్లాలోని వాజేడు మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న పెనుగోలు గ్రామానికి సాహసయాత్ర చేసి ప్రజలకు వైద్యసేవలు అందించిన ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్యను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ట్విటర్(ఎక్స్) వేదికగా ఆయన అప్పయ్య సేవలను కొనియాడారు. కొండలు, గుట్టలు ఎక్కి, వాగులు దాటుతూ కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం అందించడం గొప్ప విషయమని, ఆయనను ఆదర్శంగా తీసుకొని మిగతా జిల్లాలలోని వైద్యులు ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఇదే క్రమంలో సోషల్ మీడియాలో కూడా డాక్టర్ అప్పయ్యకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదకర స్థాయిలో మెడలోతు వరదలో వాగును దాటుతూ, దట్టమైన అడవి దారిలో సహచరులతో కలిసి అప్పయ్య పెనుగోలుకు వెళ్లివచ్చిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారగా అందరూ ఆయనను శభాష్.. అంటూ మెచ్చుకుంటున్నారు.

లంబాడా ఐక్యవేదిక పట్టణ కమిటీ ఎన్నిక

ములుగు కలెక్టరేట్, జూలై 18: ములుగు పట్టణంలో బంజారా కులస్థులు లంబాడా ఐక్యవేదిక నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్య సోమనాయక్, ప్రధాన కార్యదర్శిగా పోరిక సునీల్‌కుమార్, కోశాధికారులుగా పాడ్య కుమార్, పోరిక జయరాం, ఉపాధ్యక్షులుగా లావుడ్యా రమేష్, అంగోత్ రాజు, పోరిక అనంతరాం, పోరిక రఘురాం, రాహుల్, కార్యదర్శులుగా బానోత్ స్వామిదాస్, మూడ్ కసన్‌సింగ్, ప్రచార కార్యదర్శులుగా బానోత్ సమ్మయ్య, హట్కర్ జైపాల్, భూక్య సునీల్, గుగులోత్ తిరుపతి, సాంస్కృతిక కార్యదర్శులుగా పోరిక శ్యామల్, అజ్మీరా గోపిసింగ్, సంయుక్త కార్యదర్శులుగా గుగులోత్ రమేష్, అజ్మీరా సాంబయ్య, వాంకుడోత్ లింగా, పోరిక శంకర్, ఆహ్వాన కమిటీ సభ్యులుగా భూక్య జంపన్న, లావుడ్యా దేశాయ్, అజ్మీరా రాజారాంలు ఎన్నికయ్యారు.

మునిసిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూం

▸▸ ప్రమాదాల నివారణకు ప్రత్యేక టీంల ఏర్పాటు

భూపాలపల్లిటౌన్, జూలై 18: భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని కమిషనర్ రాజేశ్వర్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. వర్షాకాలం సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ జరిగే పరిస్థితి ఉందని తెలిసినా వెంటనే కంట్రోల్‌రూంకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ గురువారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ పరిధిలో చెట్లు విరిగినా, ప్రహరీ గోడలు ప్రమాదకరంగా ఉన్నా, ఇళ్లు శిథిలావస్థలో ఉన్నా, రోడ్లు, డ్రెయినేజీలు దెబ్బతినే పరిస్థితిలో వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ రాజునాయక్(9182082219)కు వెంటనే ఫోన్ చేసి సమాచారం తెలుపాలని చెప్పారు. అలాగే ఉదయం 6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు టెక్నికల్ అధికారి మానస, మధ్యాహ్నం 2నుంచి రాత్రి 10గంటల వరకు టీపీవో సునిల్, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఉంటారని తెలిపారు.

అటవీశాఖ ఉద్యోగులకు కౌన్సెలింగ్

కాకతీయఖని, జూలై 18: అటవీశాఖలో పనిచేస్తున్న డీఆర్‌వో, ఎఫ్ఎస్‌వోలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ పరిధిలోని భూపాలపల్లి, ములుగు, పెద్దపెల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని సిబ్బందికి సీసీఎఫ్ కాళేశ్వరం, ప్రభాకర్, సీఎఫ్ శాంతారామ్ ఆయా జిల్లాల డీఎఫ్‌వోలు వసంత, రాహుల్ కిషన్ జాదవ్, శివయ్య, శివఆశిష్‌సింగ్, నీరజ్‌టిబ్రేవాల్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. 5 జిల్లాల్లో 83 మంది డిప్యూటీ రేంజ్ అధికారులు పనిచేస్తుండగా 40 శాతంలో భాగంగా 33 మందికి, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు 188 మందికి 75 మందికి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు జిల్లా ఫారెస్ట్ అధికారులు తెలిపారు. అయితే అటవీశాఖలో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్లకు, ఆఫీస్ సబార్డినెంట్లకు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు ఇప్పటికే కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈనెల 16న ఫారెస్ట్ రేంజ్ అధికారుల(ఎఫ్ఆర్‌వో)కు నిర్మల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో 19కి వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే శుక్రవారం వీరికి తిరిగి నిర్మల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు, అలాగే ఎఫ్‌డీవోలకు పీసీసీఎఫ్ హైదరాబాద్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆశాలకు వేతనం రూ.18వేలు చెల్లించాలి

ములుగు కలెక్టరేట్, జూలై 18: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఇందుకోసం ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుని ప్రకటించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో ఆశాలు ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఆశాలు గతంలో సమ్మె చేసినప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలు, కమిషనర్‌తో జరిగిన చర్చల హామీలు అమలుకు పూనుకోవాలన్నారు. రికార్డులు ఇవ్వాలని, రూ.50 లక్షల ప్రమాదబీమా, మట్టి ఖర్చులు రూ.50వేలు, ప్రతి నెలా రెండవ తేదీన వేతనాలు అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నీలాదేవి, ఆశాలు చుంచు మంజుల, శోభ, కవిత, దేవేంద్ర, సుధారాణి, సరిత, రజిత, అరుణ, పార్వతి, సవిత, అనిత, సంధ్య భారతి, నాగమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రుణమాఫీ సంబురాలు

వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు
ఎమ్మెల్యే గండ్ర, రైతులు, కాంగ్రెస్ నేతలు

గణపురం, జూలై 18: జిల్లాలో రైతు రుణమాఫీ సంబురాలను రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, 2022 మే 6న వరంగల్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16,502 మంది రైతులకు రుణమాఫీ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో భాస్కర్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, పల్లెబోయిన కుమార్, రాజేందర్, చోటేమియా తదితరులు పాల్గొన్నారు.

● రేగొండ : రైతులకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చాం.. గడువుకంటే ముందే చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ చేసినందుకు ర్యాలీ నిర్వహించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సన్న, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, నాయకులు కటంగూరి మనోహర్‌రెడ్డి, పున్నం రవి, ఉమేష్‌గౌడ్, నాంసాని రాంబాబు, శంకరయ్య, గండి తిరుపతి గౌడ్, థామస్, మేకల భిక్షపతి, ఏనుగు రవిందర్‌రెడ్డి, పట్టెం శంకర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రైతు రుణమాఫీపై ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల రైతు వేదికల్లో రుణమాఫీ చేసిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రంగాపురం నుంచి మొగుళ్లపల్లి వరకు ఎమ్మెల్యేతో పాటు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. మొగుళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టంగూరి రామనర్సింహారెడ్డి, ఆకుతోట కుమారస్వామి, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, తక్కళ్లపల్లి రాజు, ఎమ్డీ.రఫీ, రాము, జయపాల్, రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

● టేకుమట్ల : దేశానికి అన్నం పెట్టే రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగిన రుణమాఫీ విజయోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, నాయకులు గాజర్ల అశోక్, పులి తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కాటారం : మండల కేంద్రంలోని కాటారం రైతు వేదికలో గురువారం రుణమాఫీ నిధుల విడుదల వేడుకలు జరిగాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని, నిధుల విడుదలను వీక్షించారు. రుణమాఫీ పొందిన రైతుల అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్‌లో విన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఏడీఏ శ్రీనివాస్‌రాజు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఏడీఈ నాగరాజు, ఏవో రామకృష్ణ, ఏఈవోలు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు. సీఎం, ఐటీ శాఖ మంత్రి ఫ్లెక్సీకి కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో పంట రుణాల మాఫీలో భాగంగా రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులను విడుదల చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● మంగపేట : మంగపేటలో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చౌలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలను చేసుకున్నారు. ముందుగా మంగపేట పాత బస్టాండ్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, ఉమ్మడి జిల్లాల ప్రచార కార్యదర్శి పూజారి సురేందర్‌బాబు, లావుడియా శ్యాంలాల్, భగవాన్‌రెడ్డి, అయ్యోరి యానయ్య, బండ జగన్మోహన్‌రెడ్డి, డికొండ కాంతారావు, ఎమ్డీ.మహబూబ్‌ఖాన్,నాశిరెడ్డి సాంబశివరెడ్డి, వచ్చ శేషగిరిరావు, మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, కొడం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని గంపోనిగూడెంలో గల రైతు వేదిక భవనంలో జరుపుకున్నారు. 1710 మంది రైతులు 25 గ్రామాల నుంచి భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కదిలివచ్చిసంబరాల్లో పాల్గొన్నారు.

● తాడ్వాయి : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని అమలు చేయడం పట్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్కల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయకులు బండారి చంద్రయ్య, పల్నాటి సత్యం, నాగభూషణం, చర్ప రవీందర్, యానాల సిద్దిరెడ్డి, రవికుమార్, పులి రవి, పాక రాజేందర్, ఇరుప సునీల్ పాల్గొన్నారు.

● వాజేడు : ప్రభుత్వం రైతు రుణమాఫీని ప్రకటించడంతో మండలంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పేరూరు రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ధర్మవరంలో సీఎం చిత్రపటంకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తల్లడి ఆదినారాయణ, ధనిశెట్టి రాంబాబు, రాణీమేకల రాంబాబు, కాలేశ్వరపు సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చెన్నం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. రైతు వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అంజయ్య, ఏడీఏ శ్రీధర్, ఏఈవోలు రాధిక, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం(నూగూరు) : మండలంలోని పాత్రాపురం రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించి డబ్బులు విడుదల చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. రైతు వేదికలో ఏర్పాటు చేసిన టీవీల్లో రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు, కాంగ్రెస్ నాయకులు తిలకించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, వ్యవసాయ అధికారి గుంటక నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్, చిడెం శివ, జల్లిగంపల కళాధర్, రైతులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేయడం పట్ల మండలంలోని పాలంపేటలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి పలువురికి మిఠాయి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మిల్కూరి ఐలయ్య, నాయకులు బండి శ్రీనివాస్, మారం సుమన్‌రెడ్డితోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


రేగొండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర


కాటారంలో రుణమాఫీ కార్యక్రమంలో రైతులు, అధికారులు


మంగపేటలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం దృశ్యం


పేరూరులో సీఎం చిత్రపటంకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఐటీడీఏ కార్యాలయంలో..

ఏటూరునాగారం రూరల్ : మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో రైతు రుణమాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ సందర్భంగా రైతుల ఉద్దేశించిన ప్రసంగాన్ని ఐటీడీఏలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల రైతులు వీక్షించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా లక్ష లోపు కన్నా తక్కువగా ఉన్న 966 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. అదేవిధంగా లక్ష దాటిన మిగతా రైతులకు రెండు, మూడో విడతలో రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిదాసు, ఏఈవో రాజు, కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ములుగు కలెక్టరేట్, జూలై 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీటిని అమలు చేయడంతో పాటు ఎలాంటి షరతులు విధించకుండా రూ.2 లక్షల రైతు రుణమాఫీని అమలు చేయాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ములుగులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారం రుణమాఫీ చేసి వానాకాలం పంట పెట్టుబడి సాయం ఇంతవరకు ఇవ్వలేదని, విద్యార్థులు, నిరుద్యోగులు ఎలాంటి జాబ్ క్యాలెండర్ లేక, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ తన కుర్చీ కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ పోరాటాలు చేయాలని ఆయనపిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయాలని, వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట చెరువును పునరుద్ధరించాలని, గోదావరి నీటిని ములుగు జిల్లాలోని చెరువులకు మళ్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, కొత్త సురేందర్, దేవేందర్‌రావు, దశరథం, అల్లె శోభన్, నగరపు రమేష్, రవింద్రచారి పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

▸▸ సీపీఎం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా

ఏటూరునాగారం రూరల్, జూలై 18 : వాజేడు మండలం పూసూరులో సర్వేనంబరు 11లో ఏడాదిగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద గిరిజనులకు పట్టాలివ్వాలని సీపీఎం మాజీ ఎంపీ మిడియం బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై-జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు గిరిజనులతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరికి వరదలు సంభవించినప్పుడల్లా లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం పరిపాటిగా మారిందన్నారు. గత ఏడాది నుంచి ముంపు ప్రాంతాల ప్రజలు సర్వేనంబరు 11లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గుడిసెవాసులకు పట్టాలిస్తామని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పి ఇప్పుడు కూల్చే ప్రయత్నాలు చేస్తుండడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలను కూల్చేందుకు కుట్రలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని, ఇచ్చిన హామీ మేరకు వారికి పట్టాలివ్వాలని బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుపేద గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడి సమస్యలను తీర్చేంత వరకు సీపీఎం వారి పక్షాన పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాను కలిసి పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, దావూద్, రమాదేవి, దుగ్గి చిరంజీవి, దామోదర్, కృష్ణబాబు, దేవయ్య, సౌమ్య, ముత్తయ్య, పూనెం కృష్ణబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు

ఎడతెగని వర్షం

జనజీవనం అస్తవ్యస్తం
పొంగిన వాగులు, వంకలు
లోతట్టు ప్రాంతాలు జలమయం


మత్తడి దుముకుతున్న కాటారం ఊర చెరువు


జగన్నాథపురంలో కురుస్తున్న భారీ వర్షం

కాటారం, జూలై 18 : మండలంలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఎడతెగకుండా కురిసిన వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షంతో గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం వాగులు ఉధృతంగా ప్రవహించడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటితో పంట పొలాలన్నీ చెరువులు, కుంటలను తలపిస్తున్నాయి. చెరువులన్నీ నిండి మత్తళ్లు దుముకుతున్నాయి. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.

● మంగపేట : మండలంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జోరువాన కురిసింది. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో అంతా జలమయమైంది. వరినాట్ల కోసం దున్నిన పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. వాగులు, ఒర్రెలు పొంగిపొర్లగా, కుంటలు, చెరువులు అలుగులు పోశాయి. ఈ సీజన్‌లో ఇంత భారీ వర్షం కురువడం ఇదే మొదటిసారి. వరదల వలన కమలాపురం బిల్ట్ ఇంటెక్వెల్, మంగపేట పుష్కరఘాట్‌వద్ద గోదావరి పెరుగుతుంది.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, కొయ్యూర్, కొండంపేట, వల్లెంకుంట, రుద్రారం గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. తాడిచర్ల ఓసీపీలోకి వరద వచ్చి చేరడంతో బొగ్గు వెలికితీత పనులు పాక్షికంగా నిలిచిపోయాయి. మైన్‌లో సుమారు 4వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడినట్లు మైన్ అధికారులు తెలిపారు.అలాగే పెద్దతూండ్ల ఎస్టీ కాలనీలోని ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. వర్షం వల్ల వాగులు, వంకలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల మానేరులో వరద ప్రవాహం పెరిగింది.

● వాజేడు : మండలంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాజేడు-జగన్నాథపురం ప్రధాన రహదారిపై వరద నీరు ప్రయాణికులను ఇబ్బందులు పెట్టింది. అదేవిధంగా అయ్యవారిపేటలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుండపోతవర్షంతో రైతులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదానికి కారకులను శిక్షించాలి

కాకతీయఖని, జూలై 18 : ఆర్జీ-3 డివిజన్‌లోని ఓపెన్ కాస్టు-2 ప్రమాదానికి గల కారకులను శిక్షించాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బుచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పని స్థలంలో సేఫ్టీ లేకపోవడంతో ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. దీంతో ఇద్దరు కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారని, అందుకు కారకుడైన సేఫ్టీ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇద్దరు కార్మికుల మరణానికి కారకులైన వారందరిని విచారణ చేపట్టి శిక్షించాలని ఆయన కోరారు.

డిమాండ్లను పరిష్కరిస్తేనే భూములిస్తాం

టేకుమట్ల, జూలై 18 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తేనే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములిస్తామని బాధిత రైతులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవేను బ్రౌన్‌ఫీల్డ్ హైవేగా మార్చాలని, లేదంటే గ్రీన్‌ఫీల్డ్ హైవేను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.10 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని, టోల్ రుసుంలో 70 శాతం బాధిత రైతులకు చెల్లించాలని అన్నారు. అధికారులు స్పందించి పై డిమాండ్లను పరిష్కరించకపోతే మా కుటుంబాలకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టేకుమట్ల, జూలై 18 : మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన కొమ్మనవేన ఓదెలు, కొండ ప్రకాశ్‌లకు గురువారం రాత్రి ఆశిరెడ్డిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. వీరు ఇరువురు పని నిమిత్తం టేకుమట్లకు వచ్చి తిరిగి వారి గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఆశిరెడ్డిపల్లిలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 వాహనానికి సమాచారం అందించడంతో బాధితులను చిట్యాల ఆస్పత్రికి తరలించారు.

అన్నారం బ్యారేజీలో కొనసాగిన పరీక్షలు

మహదేవపూర్, జూలై 18 : అన్నారం బ్యారేజీలో సెస్మిక్ పరీక్షలకు అంతరాయం ఏర్పడింది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నిపుణులు పరీక్షలను నిలిపివేశారు. గురువారం వర్షం లేకపోవడంతో సంబంధిత బృందం నిపుణులు పరీక్షలు నిర్వహించారు. మొదటి దశ పరీక్షలు జూన్ 21న ప్రారంభం కాగా 15 రోజుల పాటు నిర్వహించారు. మొదటి బృందం డ్రిల్లింగ్ చేస్తూ అత్యాధునిక జియో రాడార్‌తో పరీక్షలు చేసింది. రెండో దశ పరీక్షలు శాస్త్రవేత్తల బృందం చేస్తోంది. ఎగువన, దిగువన 44 జియో ఫిజికల్, సెస్మిక్ పరీక్షలు నిర్వహించగా కొన్ని పెండింగ్‌లో ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఇప్పలపల్లిలో పాముకాటుతో మహిళ మృతి

▸▸ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా ఘటన

కాటారం, జూలై 18: మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ పరిధి ఇప్పలపల్లి గ్రామానికి చెందిన నీలారపు పద్మ అలియాస్ మల్లక్క(52) అనే మహిళ పాము కాటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పద్మ బుధవారం రాత్రి ఇంట్లో మంచంలో నిద్రిస్తుండగా పైకప్పు నుంచి కిందపడ్డ పాము కాటు వేసింది. దీంతో పద్మ లబోదిబోమంటూ తల్లితో పాటు చుట్టుపక్కల వారిని లేపి విషయం తెలిపింది. వారు హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, పద్మ భర్త శంకర్ 10ఏళ్ల క్రితమే చనిపోగా, కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలకు పెళ్లిళ్లు చేసి తల్లి వద్ద ఉంటూ జీవనం సాగిస్తుంది. కాగా, నిరుపేద అయిన పద్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఆత్మకూరి రాజయ్య కోరారు.

సమస్యలు పరిష్కరించాలని బాలికల నిరసన

తాడ్వాయి, జూలై 18 : మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల జూనియర్ కళాశాలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కళాశాల ఆవరణలో బాలికలు ప్లకార్డులు చేబూని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ కళాశాల ప్రారంభమై పదేళ్లు గడుస్తున్నప్పటికీ మౌలిక వసతులు లేవని, పూర్తిస్థాయిలో తరగతి గదులు, బెడ్లు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా కళాశాలకు చేరుకుని విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని తీరు పట్ల పీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, నిరసనలు తెలుపకుండా సమస్యలకు పరిష్కారం చూపేవిధంగా చూడాలని మందలించారు. కళాశాలలోని సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు తరగతి గదులకు వెళ్లారు.

రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేయాలి

▸▸ కలెక్టర్ దివాకర ▸▸ మండలాల్లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు

ములుగు కలెక్టరేట్, జూలై 18 : జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12,906 మంది రైతులకు రుణమాఫీ జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా రూ.లక్ష లోపు బకాయి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని, రెండో విడత ఈనెల 31 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా రుణమాఫీ ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ నంబర్, బ్యాంకు వివరాలు తెలుసుకోవాలని అన్నారు. రైతులకు ఇచ్చిన రుణ వివరాలు, రుణమాఫీ జరిగిన తర్వాత మిగిలిన రైతుల వివరాలు కూడా సేకరించాలని, రుణమాఫీ వచ్చిన వారి వివరాలు, రాని వారి వివరాలు పక్కాగా ఉండాలన్నారు.

2023 డిసెంబరు 9వ తేదీ వరకు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుని ఇప్పటి వరకు తిరిగి చెల్లించని రైతులకు రుణమాఫీ ఉంటుందని కలెక్టర్ దివాకర పేర్కొన్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాల రైతుల సౌకర్యార్థం రుణమాఫీపై ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా మండలాల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు గ్రీవెన్స్ సెల్‌ను సంప్రదించి సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్, లీడ్ బ్యాంకు అధికారి డీసీవో సర్దార్‌సింగ్, వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.